క్లుప్తంగా

డీటీఎఫ్ జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక


అధ్యక్షురాలు హైమావతి


ప్రధాన కార్యదర్శి సూర్యచంద్ర

మక్తల్: జిల్లా డీటీఎఫ్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎన్నికల నిర్వహకులు రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీశైలం, రాష్ట్ర కార్యదర్శి రామస్వామి ఆదివారం తెలిపారు. జిల్లా ప్రధాన కార్యదర్శిగా సూర్యచంద్ర, జిల్లా అధ్యక్షురాలిగా హైమావతి, ఉపాధ్యక్షులుగా చెన్నయ్య, స్పందన, కార్యదర్శులుగా శ్రీవిద్య, మౌనిక, చంద్రశేఖర్, రాష్ట్ర కౌన్సిలర్‌గా పరందారాములు, వెంకట్‌రాములు, ఆడిట్ కన్వీనర్ అమ్మణ్ణ తదితరులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం రాజీలేని పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో మండల బాధ్యురాలు పరంజ్యోతి, కవిత, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

బీజేవైఎం నగర అధ్యక్షుడిగా మణిశంకర్



నారాయణపేట: పట్టణ భారతీయ జనతా యువ మోర్చా (బీజేవైఎం) నూతన అధ్యక్షుడిగా జాజాపూర్ మణిశంకర్ (చంటి)ను బీజేపీ జిల్లా అధ్యక్షుడు సత్య యాదవ్, నగర అధ్యక్షుడు పోషల్ వినోద్ సమక్షంలో ఆదివారం ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మణిశంకర్‌ను శాలువాతో ఘనంగా సన్మానించారు. పార్టీ అభివృద్ధికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని నాయకులు సూచించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం



నారాయణపేట రూరల్ : మండలంలోని కోటకొండ జెడ్పీ ఉన్నత పాఠశాలలో 2006–07 బ్యాచ్ పదో తరగతి విద్యార్థుల సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనాటి జ్ఞాపకాలు గుర్తు చేసుకుంటూ సంతోషంగా గడిపారు. అనంతరం ఉపాధ్యాయులను శాలువా, జ్ఞాపికతో సన్మానించారు. మృతి చెందిన స్నేహితుల కుటుంబాలకు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో పూర్వ ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కిషన్‌రెడ్డిపై విమర్శలు తగదు

నారాయణపేట టౌన్: రాష్ట్ర అభివృద్ధికి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అడ్డుపడుతున్నారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పదే పదే విమర్శలు చేయడం తగదని పట్టణ బీజేపీ అధ్యక్షుడు పోషల్ వినోద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సీఎం విమర్శలు చూస్తుంటే ఆడలేక మద్దెల ఓడిందన్న చందంగా ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి అభివృద్ధి, ప్రజా సమస్యలపై ఏమాత్రం చిత్తశుద్ధిలేదని విమర్శించారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం బీజేపీపై విమర్శలు మాని ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని పేర్కొన్నారు.

ఘాట్ రోడ్డు నిర్మాణానికి మట్టి సేకరణ

చిన్నచింతకుంట: చిన్నచింతకుంట మండలం అమ్మాపురం కురుమూర్తి స్వామి ఆలయం వద్ద ఎలివేటెడ్ కారిడార్, ఘాట్ రోడ్డు నిర్మాణం చేపట్టేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. అధికారులు ఆలయం వద్ద రోడ్డు నిర్మాణానికి చర్యలు చేపడుతున్నారు. ఆదివారం అధికారులు మట్టి సేకరణ పనులు చేపట్టారు. డ్రిల్లింగ్ మిషన్ల ద్వారా ముప్పై మీట్ల లోతునుంచి మట్టిని సేకరిస్తున్నారు. అట్టి మట్టి నమూనాలను టెస్టింగ్‌కు పంపనున్నట్లు తెలిపారు. పని వివరాలను ఆలయ చైర్మన్ గోవర్ధన్ రెడ్డి, ఈఓ మదనేశ్వరెడ్డిలు సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ కురుమూర్తి స్వామి ఆలయం అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. అందుకు ఆలయం వద్ద ఘాట్ రోడ్డు నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు.



నిరుపయోగంగా చెక్‌డ్యాంలు


కొత్తపల్లి రహదారిలో కోతకు గురైన చెక్‌డ్యాం

- వరదనీటికి కొట్టుకుపోయి, శిథిలావస్థకు
- మరమ్మతులు చేపట్టని అధికారులు
- పెద్ద వాగుపై నిర్మించాలని రైతుల డిమాండ్

మాగనూర్: వరద నీటిని నిల్వ ఉంచి భూగర్భ జలాలను పెంపొందించేందుకు చేపట్టిన చెక్‌డ్యాంల నిర్మాణాలు నిర్వాహణ లేక అస్తవ్యస్తంగా మారాయి. చెక్‌డ్యాంల నిర్మాణాలు శిథిలావస్థకు చేరి ఆనవాళ్లను సైతం లేకుండా పోయాయి. నీటి సంరక్షణకు పెద్దపీట వేస్తూ ప్రభుత్వం చేపట్టిన చెక్‌డ్యాంలతో ఉపయోగం లేకుండా పోయింది. సరైన నిర్వహణ లేక పథకం నీరుగారుతోందని మండలంలోని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు.

నెరవేరని ప్రభుత్వ లక్ష్యం..

వర్షపునీరు వృథాగా పోకుండా పది సంవత్సరాల క్రితం నిర్మించిన చెక్‌డ్యాంలు శిథిలావస్థకు


అచ్చంపేట పరిధిలో నిరుపయోగంగా చెక్‌డ్యాం

చేరాయి. నిర్వాహణ గాలికొదిలేయడంతో వర్షపు నీరు వృథాగా పోతుంది. దీంతో ప్రభుత్వం లక్ష్యం నేరవేరడం లేదు. లక్షలాది రూపాయాలు వెచ్చించి వాగులు, చెరువులు, కుంటల వద్ద నిర్మించిన చెక్‌డ్యాంలు కనీసం పశువుల దాహార్తి తీర్చేందుకు కూడా ఉపయోగపడటం లేదని రైతులు విమర్శిస్తున్నారు. మండల పరిధిలోని కొత్తపల్లి రోడ్డు సమీపంలో నిర్మించిన చెక్‌డ్యాం రైల్వేలైన్ కోసం తీసిన మొరం కారణంగా కుంగి పోవడానికి సిద్ధంగా ఉంది.

నాణ్యత కరువు..

మండంలోని ఆయా గ్రామాల్లో నిర్మించిన చెక్‌డ్యాం నిర్మాణాల్లో కనీస నాణ్యత ప్రమాణాలు పాటించ లేదు. వరదనీటికి అనుగుణంగా నిర్మించకపోవడంతో ఆలంకార ప్రాయంగా మారాయి. చెక్‌డ్యాం ఇరువైపులా ఉన్న గట్లకు రాతి కట్టడాలను నిర్మించకపోవడంతో వరద నీటికి కొట్టుకుపోయాయి. మరికొన్ని చోట్ల లీకేజీలు ఏర్పడ్డాయి. చెక్‌డ్యాంలకు మరమ్మతులు చేపడితే వినియోగంలోకి వస్తాయి. కానీ అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు.

వాగుపై నిర్మించాలి..



మాగనూర్ పెద్దవాగుపై సంగంబండ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ ఉంది. గేట్లు తెరచి దిగువకు నీరు వదిలిన సమయంలో వృథాగా మళ్లీ నదిలో నీరు కలుస్తుంది. వాగుపై కూడా చెక్ డ్యాంల నిర్మాణం చేపడితే వేసవిలో సైతం పుష్కలంగా నీరు లభించి రైతులకు ఉపయోగకరంగా ఉంటుంది.

–పి. అంజనేయులు రైతు మాగనూర్

మరమ్మతులు చేపట్టాలి..



గతంలో నాసిరకంగా చెక్‌డ్యాంలు నిర్మించడంతో వరద తాకిడికి కొట్టుకు పోయాయి. చెక్‌డ్యాంలలో నీరు నిల్వ లేక నిరుపయోగంగా మారాయి. చెక్‌డ్యాంలు కొట్టుకుపోయిన చోట, లీకేజీలు ఏర్పడిన చోట మరమ్మతులు చేపట్టాలి.

–అంజనేయులుగౌడ్ రైతు మాగనూర్

చెక్‌డ్యాంలు ఏర్పాటు చేస్తాం..



లోతట్టు ప్రాంతాలు కోతకు గురికాకుండా, నీటిని నిల్వ చేసి వాటిని పంట పొలాలకు, బోరు బావుల ద్వారా అందించేందుకు గతంలో నిర్మాణం చేపట్టిన చెక్క్‌డ్యాంలు అయితే ప్రస్తుతం ఐడబ్ల్యూఎంపీ, ఈజీఎస్ కలిపారు. కానీ చెక్క్‌డ్యాంల అంశం చేర్చలేదు. నూతన చెక్ డ్యాంల నిర్మాణానికి ఏప్రిల్ మొదటి వారం నుంచి పనులు గుర్తించి చెక్ డ్యాంలు ఏర్పాటు చేస్తాం. పాత వాటి నిర్వహణకు ప్రభుత్వం నుంచి ఎటువంటి ఆదేశాలు రాలేదు.

– హర్షవర్ధన్‌రెడ్డి ఇన్‌చార్జి ఏపీఓ, మాగనూర్

ప్రమాదాలకు నిలయంగా కూడలి


హిందూపూర్‌లోని నాలుగు రోడ్ల కూడలి

కృష్ణా: మండల పరిధిలోని హిందూపూర్ గ్రామంలోని నాలుగు రోడ్ల కూడలి ప్రమాదాలకు నిలయంగా మారిందని ప్రజలు, వాహనదారులు వాపోతున్నారు. నిత్యం కూడలిలో ఏదో ఒక ప్రమాదం సంభవిస్తుందని పేర్కొంటున్నారు. రోడ్డు వెడల్పుతో పాటూ డివైడర్ ఏర్పాటు చేసిన అనంతరం ప్రమాదాలు జరుగుతున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. డివైడర్లతో పాటూ వాటికి ఎత్తైన గ్రిల్స్ ఏర్పాటు చేయడంతో వాహన చోదకులు గ్రహించలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. సంవత్సర కాలంగా కూడలిలో ప్రమాదాలు జరుగుతున్నప్పటికీ అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నట్లు విమర్శిస్తున్నారు. ఈ విషయంపై పలుమార్లు అధికారులకు వినతిపత్రాలు ఇచ్చిన పట్టించుకోలేదని ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఉచిత వైద్యశిబిరం విజయవంతం

మద్దూరు: మున్సిపల్ కార్యాలయ ఆవరణలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం విజయవంతమైనట్లు నిర్వాహకులు తెలిపారు. నారాయణపేటకు చెందిన పీఎస్ సునంద మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఎముకలు, కీళ్లకు సంబంధించిన వ్యాధులపై డాక్టర్ ఎం. ప్రసాద్‌శెట్టి, డాక్టర్ దీపాక శెట్టి వైద్య సేవలు అందించారు. మారుముల గ్రామాలకు హాస్పిటల్ తరపున వైద్యం అందాలనే ఉద్దేశంతో మద్దూరులో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు వైద్యులు తెలిపారు. దాదాపు 400 మంది రోగులకు వైద్య సేవలందించారు. కార్యక్రమంలో జెడ్పీ మాజీ ఆప్షన్ సభ్యుడు సలీం,


వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

మాజీ సర్పంచ్ అరుణ, మాజీ ఎంపీటీసీ వెంకటయ్య, ఆర్యవైశ్య సంఘం నాయకులు విజయ్‌కుమార్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

శ్రీపాదరావు సేవలు మరువలేనివి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ స్పీకర్ శ్రీపాదరావు ప్రజలకు చేసిన సేవలు మరువలేనివని రెవెన్యూ అదనపు కలెక్టర్ మోహన్‌రావు అన్నారు. ఆయన జయంతి సందర్భంగా ఆదివారం కలెక్టరేట్‌లోని మీటింగ్‌హాల్లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు శ్రీపాదరావు జయంతి అధికారికంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శ్రీపాదరావు న్యాయవాదిగా ప్రజలకు మంచి సేవలు అందించారని, ఆయన రాజకీయ ప్రస్థానంలో మొదటిగా సర్పంచ్ గా రెండు సార్లు ఎన్నికై తదుపరి ఉమ్మడి కరీంనగర్ జిల్లా మహాదేవపూర్ సమితి అధ్యక్షుడిగా ఎన్నికయ్యారని చెప్పారు. 1984 ఎన్నికల్లో మొదటి సారి మంథని నుంచి శాసన సభ్యులుగా పోటీ చేసి విజయం సాధించి 3 సార్లు శాసన సభ్యుడిగా ఎన్నికైనట్లు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసన సభ స్పీకర్‌గా పని చేశారని, శాసన సభ నడిపించిన తీరు ఆదర్శప్రాయం అన్నారు. కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడల అధికారి శ్రీనివాస్, కలెక్టరేట్ పరిపాలన అధికారి శంకర్, తదితరులు పాల్గొన్నారు.


శ్రీపాదరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అధికారులు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: శాసనసభ మాజీ స్పీకర్ పి.శ్రీపాదరావు జయంతిని స్థానిక మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో మేనేజర్ వెంకటేశ్వరరావు, ఆర్ఓ మహమ్మద్ ఖాజా, ఆర్ఐ టి.నర్సింహ పాల్గొన్నారు.

'పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలి'

అమరచింత: రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించడంతో పాటు ఎండిపోయిన పంటలకు పరిహారం ఇచ్చి రైతులను ఆదుకోవాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కోశాధికారి వెంకటేష్ డిమాండ్ చేశారు. మండలంలోని పాంరెడ్డిపల్లిలో ఆదివారం రైతు సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. దేశంలో రైతులు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని, ఎరువులపైన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సబ్సిడీలు ఎత్తేసి అన్నదాతలపై భారం మోపుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పండించే ప్రతి పంటకు గిట్టుబాటు ధరను కల్పించి మార్కెట్‌లో స్వేచ్ఛగా అమ్ముకునే అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. క్షేత్ర స్థాయిలో సరైన మార్కెట్ సౌకర్యం లేకపోవడంతో గ్రామీణ ప్రాంతాల్లో రైతులు దళారుల చేతిలో నేటికీ మోసపోతున్నారని వాపోయారు. కార్యక్రమంలో మోహన్, రాజు, శంకర్, నాగరాజు, చంద్రాయుడు, మహేష్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న మెగా సైన్స్‌మేళా



మరికల్: మండల కేంద్రంలోని ప్రతిభ ఉన్నత పాఠశాలలో ఆదివారం నిర్వహించిన మెగా సైన్స్ మేళా ఆకట్టుకుంది. విద్యార్థులు తయారు చేసిన వివిధ రకాల సైన్స్ ప్రయోగాలను పలు పాఠశాలల విద్యార్థులతో పాటు ప్రజా ప్రతినిధులు, నాయకులు సందర్శించారు. మేళాలో ప్రతిభ చూపిన విద్యార్థులను నాయకులు అభినందించారు. కార్యక్రమంలో కరస్పాడెంట్ హనుమంతురెడ్డి, ప్రిన్సిపాల్ శ్రీదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్వామి శాంతానంద్‌కు డాక్టరేట్



నారాయణపేట: జిల్లా కేంద్రంలోని శక్తి పీఠం వ్యవస్థాపకులు డాక్టర్ స్వామి శాంతానంద్ పురోహిత్ డాక్టరేట్ అవార్డు పొందారు. ఆధ్యాత్మిక విభాగంలో ఆయన చేసిన కృషిని గుర్తించిన కాలిఫోర్నియాకు చెందిన అమెరికన్ మేనేజ్‌మెంట్ యూనివర్సిటీ ఢిల్లీలో డాక్టరేట్ ప్రదానం చేశారు. ఈ సందర్భంగా శక్తిపీఠం సభ్యులు రుద్రసముద్రం రాములు, మురళీధర్, యాదగిరి నారాయణరెడ్డి, దోమ సుధాకర్ తదితరులు శాంతానందను అభినందించారు.

ఉన్నతంగా ఎదిగేలా విద్యాబోధన ఉండాలి

నారాయణపేట టౌన్: విద్యార్థులు ఉన్నతంగా ఎదిగేలా విద్యాబోధన ఉండాలని నారాయణపేట ఎమ్మెల్యే డా.చిట్టెం పర్ణికారెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా సమీపంలో మాస్టర్ మైండ్స్ ఇంటర్నేషనల్ ప్రైమరీ స్కూల్‌ను ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. మారుతున్న టెక్నాలజీ, పోటీ తత్వాన్ని ఎదుర్కొనేలా విద్యార్థులను తీర్చిదిద్దాలన్నారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ హరి నారాయణ భట్టాడ్ తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయ నిర్మాణానికి అంకురార్పణ

కొత్తకోట రూరల్: పట్టణ కేంద్రంలో అయ్యప్ప సేవాసమితి ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహిస్తున్న ప్రదేశంలో బ్రహ్మశ్రీ గోపాలకృష్ణ గురుస్వామి ఆధ్వర్యంలో ఆగమశాస్త్ర పండితులు శ్రీనందివెలుగు బ్రహ్మశ్రీ బాలాజీ గురుకుల్ వారి బృందం ఆధ్వర్యంలో ఆదివారం అయ్యప్ప ఆలయ నిర్మాణం కోసం పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పూజా కార్యక్రమాల్లో భాగంగా స్థల సంప్రోక్షణ లక్ష్మీగణపతి హోమం, వాస్తు హోమం, నవధాన్యాలు, నవరత్నాలు, పంచలోహాలతో యంత్రస్థాపన తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ నిర్మాణ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు డాక్టర్ పీజే బాబు, మాజీ ఎంపీపీ గుంత మౌనిక ఉన్నారు.

భగత్‌సింగ్ స్ఫూర్తితో పోరాడాలి


భూమి పూజ చేస్తున్న నాయకులు

మక్తల్: భగత్‌సింగ్ స్ఫూర్తితో విద్యార్థులు, యువత సమాజం కోసం పోరాటం చేయాలని ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని నారాయణపేట చౌరస్తాలో భగత్‌సింగ్ విగ్రహ నిర్మాణానికి భూమి పూజ చేశారు. భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రజలు చైతన్యంతో ఐక్యంగా పోరాడాలన్నారు. కార్యక్రమంలో ఈశ్వర్, భాస్కర్, వక్త కృష్ణ, అనిల్, ఎ.సలీం, కాశీనాథ్, కిరణ్, సూర్యప్రకాష్, భగవంతు, హన్మంతు, రాము, శారద, రాము, వెంకట్‌రెడ్డి, కృష్ణయ్య, సావిత్రమ్మ, చెన్నప్ప, శేకర్, గణేస్, రాకేష్, తిమ్మతి, అనూష, అఖిల స్వాతి తదితరులు పాల్గొన్నారు.

అదనపు గదులు నిర్మించరూ..?


పాఠశాల ఆవరణలో ప్రమాదకరంగా ఉన్న ఇనుప రాడ్లు

మాగనూర్: ప్రభుత్వ బడులను బలోపేతం చేస్తామంటున్నా పాలకుల మాటలు క్షేత్ర స్థాయిలో నీటి మూటలే అవుతున్నాయని విద్యార్థులు తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. మండల పరిధిలోని మందిపల్లి ప్రాథమిక పాఠశాలలో అదనపు గదుల నిర్మాణం పిల్లర్ల దశలోనే వదిలేయడంతో విద్యార్థుల పాలిట శాపంగా మారిందంటున్నారు. పిల్లర్ల నిర్మాణం కోసం ఉంచిన ఇనుప రాడ్లు ప్రమాదకరంగా ఉన్నాయి. విద్యార్థులకు ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని విద్యార్థులు తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అదనపు గదుల నిర్మాణం పనులు ప్రారంభించాలని కోరుతున్నారు.

పాత పెన్షన్ విధానాన్ని వెంటనే అమలు చేయాలి


ధర్నాకు బయలుదేరుతున్న సీపీఎస్ ఉద్యోగులు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని సీపీఎస్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు బాలస్వామి, కార్యదర్శి చంద్రకాంత్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక జెడ్పీ కార్యాలయం నుంచి చలో ఇందిరాపార్క్ ధర్నాకు తరలి వెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ఏడాది జనవరి 24న కేంద్ర ఆర్థికశాఖ విడుదల చేసిన గెజిట్ ప్రకారం యూనిఫైడ్ పెన్షన్ స్కీమ్ 1 ఏప్రిల్ 2025 నుంచి అమలు చేయాలని గెజిట్‌లో పేర్కొన్నట్లు తెలిపారు. ప్రభుత్వాలు సీపీఎస్ యూపీఎస్ వంటి పెన్షన్ పథకాలతో ఉద్యోగ ఉపాధ్యాయులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. గత పదిహేనేళ్లుగా సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ ఇవ్వాలని పోరాటం చేసి గ్రాడ్యూటీ, ఫ్యామిలీ పెన్షన్ సాధించుకున్నామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఐటీ సెల్ కన్వీనర్ వెంకటేష్, జిల్లా కోశాధికారి రాఘవేంద్ర, జిల్లా బాధ్యులు రాఘవేందర్ రెడ్డి, మల్లేష్, రాజేష్, కృష్ణారెడ్డి, ఖాదర్, శ్రీనివాస్‌రెడ్డి, కేశవరెడ్డి, రమేష్, కవిత, మండల నాయకులు, సీపీఎస్ ఉద్యోగ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థి సంఘం నాయకుల ముందస్తు అరెస్టు


పోలీసుల అదుపులో విద్యార్థి సంఘాల నాయకులు

అమరచింత: జిల్లా పర్యటనకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదివారం రావడంతో ముందస్తు చర్యల్లో భాగంగా విద్యార్థి సంఘాల నాయకులను పోలీసులు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. మండలంలోని ఏబీవీపీ, పీడీఎస్‌యూ, ఎస్ఎఫ్ఐ, విద్యార్థి సంఘాల నాయకులతో పాటు వామపక్ష పార్టీలకు చెందిన యువజన సంఘాల నాయకులను సైతం అరెస్టు చేసినట్లు ఎస్ఐ సురేష్ తెలిపారు. ఈమేరకు విద్యార్థి సంఘాల నాయకులతో పాటు యువజన సంఘాల నాయకులు రాకేష్, ఉదయ్, రాఘవ, వెంకటేష్, రాజు, కుతుబ్ మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రశ్నించడం నేరమైందని, రాష్ట్రంలో రాచరిక పాలన కొనసాగుతుందని మండిపడ్డారు.

భక్తిశ్రద్ధలతో పరమేశ్వరస్వామి జాతర


ఆకట్టుకున్న పల్లె కోలాటం

- తేరుకు వేలాదిగా హాజరైన భక్తులు
- స్వామివారికి దాసంగాలతో మొక్కులు


స్వామివారి మూలవిరాట్


స్వామివారి రథోత్సవం

ఆత్మకూర్: పట్టణం శివారులోని చెరువు మధ్యలో వెలిసిన స్వయంభూ పరమేశ్వర స్వామి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి భక్తిశ్రద్ధలతో పూజలు, రథోత్సవాన్ని నిర్వహించారు. ఉదయం స్వామివారికి రుద్రాభిషేకం నిర్వహించి ఉత్సవమూర్తి విగ్రహాలను ఆలయంలోని శివలింగంపై అలంకరించారు. వందలాది మంది భక్తులు బక్షాలు, పచ్చిపులుసు, అన్నంతో స్వామివారికి నైవేద్యం సమర్పించి దాసంగాలు పెట్టారు. అనంతరం ప్రముఖ పూజారి కర్నసయ్య ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. జాతర కమిటీ కన్వీనర్ వెంకటనర్సింహారావు, నిర్వాహకులు సాయిరాఘవ, మణివర్ధన్‌రెడ్డి, యాదగిరిశెట్టి, తెలుగునాగేష్ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లను ఘనంగా చేపట్టారు. గుంటిపల్లి గ్రామస్తుల పల్లెకోళ్ల కోలాటం ప్రత్యేకార్షణగా నిలిచింది.

కనులపండువగా పల్లకీ సేవ..

ఆదివారం రాత్రి వేంకటేశ్వరస్వామి ఆలయం నుంచి మొదలుకొని పట్టణంలోని పుర వీధుల గుండా స్వామివారికి మేళతాళాలతో పల్లకీసేవ నిర్వహించారు. అనంతరం పల్లకీసేవను ఆలయానికి చేర్చి ప్రత్యేక పూజలు చేశారు. జిల్లా నలుమూలల నుంచి భక్తులు వేలిదిగా తరలివచ్చారు. సోమవారం రాత్రి తేరు సందర్భంగా ప్రత్యేక పూజలు, ఇతర కార్యక్రమాలు చేపడుతున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు రహ్మతుల్లా, రవికాంత్, నాగేష్, పరమేష్, తులసిరాజ్, శ్రీను, దామోదర్, మహేష్ తదితరులు ఉన్నారు.

ఉత్సాహంగా కబడ్డీ పోటీలు..

పరమేశ్వరస్వామి జాతరను పురస్కరించుకొని ఆదివారం నిర్వహించిన జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు ఉత్సాహంగా కొనసాగాయి. మొత్తం 40 జట్లు పాల్గొనగా సోమవారం ఫైనల్ మ్యాచ్ జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. మొదటి బహుమతి రూ.20 వేలు, రెండో బహుమతి రూ.15 వేలు, మూడో బహుమతి రూ.10 వేలు, నాల్గో బహుమతి రూ.5 వేలు నగదుతో పాటు షీల్డ్‌లను ఎమ్మెల్యే డాక్టర్ వాకిటి శ్రీహరి చేతుల మీదుగా అందజేస్తామని వివరించారు.

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నెంబర్లకు ఉదయం 7-00 గం॥ల నుండి రాత్రి 8-00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే చర్యలు తీసుకోబడును.

ఎస్.రాజేందర్ గౌడ్, ACM - 9618066349 టోల్‌ఫ్రీ నెం.: 1800 270 1083

నారాయణపేట	జి. వెంకటేష్ గౌడ్	- 96666 52077
మక్తల్	మల్లేష్	- 83099 46853
కోస్గి	కె. రమేష్	- 99486 98552

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి

మీరు సాక్షిలో వివాహ, జన్మదిన, పదవీ విరమణ, విదేశీ పర్యటన, స్వదేశాగమనం, అవార్డు గ్రహీతలకు శుభాకాంక్షలు, మీ ఆత్మీయులకు శ్రద్ధాంజలి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, బహిరంగ ప్రకటనలు, అతి తక్కువ ఖర్చుతో కొండత స్పందన లభించే క్లాసిఫైడ్ యాడ్స్ ఇవ్వదలచినచో మీరు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు :

యాడ్స్ మేనేజర్
9951602829
జావిద్ : 90109 62007